394) గుజ్జరి/సావేరి

ప॥ ఒకటి కొకటి లంకై వూరకైనా బెనగొను। అకటా యెవ్వరు దాటేరయ్య నీమాయలు॥

చ॥ తనయెదుటిదెల్లాను దలపులో బారును। మనసులోపలివెల్లా మర్మము లంటు।
ఘనమర్మములు రేగి కాయమెల్లా గరగించు। తనువుసౌఖ్య మవ్వలితనువున నంటును॥

చ॥ అవ్వలిదేహభోగము లట్టేసర్వములౌను। మువ్వంక గర్మాలు లోకములై చెందును।
చివ్వన నాలోకములు చేరి కాలము గడపు। తెవ్వనికాలము నిద్రా దెలివినై ముంచును॥

చ॥ వెస నాతెలివి యొకవేళ నెన్నెఱిగించు। వసమై ఆయెఱుకకు వచ్చి మెత్తువు।
యెసగి నీవు మెచ్చితే యిహపరము లిత్తువు। మిసిమి శ్రీవేంకటేశ మెరయు నీయీవి॥